క్లుప్తంగా

మంత్రి తుమ్మలను కలిసిన మార్కెట్ చైర్మన్లు



చైర్మన్లను సత్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి/కల్లూరు: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్తుపల్లి, కల్లూరు మార్కెట్ చైర్మన్లుగా నియమితులైన దోమా ఆనంద్‌బాబు, భాగం నీరజాదేవి సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. వైస్‌చైర్మన్లు గొర్ల వెంకటప్పారెడ్డి, రాజబోయిన కోటేశ్వరరావుతో కలిసి వారు తమ నియామకంపై మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి చైర్మన్, వైస్‌చైర్మన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదె చెన్నారావు, గంధ్ర విజయ్, భాగం ప్రభాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన పాలకొల్లు



సత్తుపల్లి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం సత్తుపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లా పర్యటనలో త్వరలో సత్తుపల్లికి కూడా వస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారని పాలకొల్లు శ్రీనివాస్ తెలిపారు.

శివాలయంలో వనమహోత్సవం

కొణిజర్ల: మండల కేంద్రం కొణిజర్లలోని శ్రీమాన్ మహా దేవాలయం (శివాలయం)లో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ అమ్మాజాన్, ఆలయ కమిటీ పెద్దలు స్వర్ణ రమేష్, కొదుమూరి రవికిషోర్ తదితరులు ఆలయంలో మొక్కలు నాటారు. అనంతరం ఉపాధికూలీలతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

ఏన్కూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు ఎస్‌కె లాల్ మియా డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఆందోళన చేస్తామన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆగస్టు ఒటిన మండలకేంద్రంలో ధర్నాలు, 8న కలెక్టరేట్ ముట్టడి, 21న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండే వెంకటేశ్వర్లు, ఆనంద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

ముదిగొండ: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుసోత్తం అన్నారు. ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీకి రేషన్‌కార్డు లింక్ పెట్టడం సరికాదన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మందరపు వెంకయ్య, కల్యాణ్, నాగేశ్వరరావు, భద్రయ్య, బట్టు రాజు, మెట్టెల సతీష్, లింగయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బైక్ చోరీ

మధిర: మధిర పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సోమవారం బైక్ చోరీకి గురైంది. టీఎస్‌ఆర్టీసీ మధిర డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న పరిటాల శ్రీకాంత్ బస్టాండ్ సమీపంలో బైక్ పెట్టి డ్యూటీకి వెళ్ళగా డ్యూటీ దిగిన తర్వాత చూస్తే బైక్ కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు భావించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సత్తుపల్లిరూరల్: ఉపాధిహామీ కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో ఉపాధిహామీ కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలలుగా వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే ఈ పథకాన్ని రెండుసార్లు ఫొటోలు తీసే ఎన్ఎంఎం సిస్టం విధానం తీసుకొచ్చి కూలీలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, రమేష్, ప్రసాద్, సత్యనారాయణ, లాల్ వెంకట్, ప్రసాద్, రంజాన్, రాంబాబు, హమీద్, శ్రీనివాసరావు, అజయ్, రవి పాల్గొన్నారు.

ప్రాంగణాలు ఇలా.. ఆడేదెలా..?

- వసతుల లేమితో క్రీడలకు అవరోధం
- బోర్డులకే పరిమితమైన ప్రాంగణాలు..
- పట్టించుకోని పంచాయతీలు



రేమిడిచర్లలో ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

మండలంలోని గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు పేరుకు మాత్రమే ఉన్నట్లుంది. క్రీడా ప్రాంగణాల్లో ఆడుకునేందుకు గానూ ఎటువంటి వసతులు లేవు. వసతుల లేమితో క్రీడాకారులు అవస్థలకు గురవుతున్నారు. బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొత్త ప్రభుత్వంలో కూడా ఉన్నతాధికారులు ఈ ప్రాంగణాల పనితీరుపై సమీక్షకు నోచుకోవడం లేదు. క్రీడా ప్రాంగణాలు పాలకుల పనితీరును వెక్కిరిస్తున్నాయి.

ఎర్రుపాలెం: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 24 పంచాయతీల్లో ఏర్పాటు చేసి ప్రాంగణాలన్నీ పేరుకు మాత్రమే అన్నట్లుగా ఉన్నాయి. గట్ల గౌరారం, రాజుపాలెం, నర్సింహాపురం, కాచారం, ఇనగాలి, లక్ష్మీపురం, ములుగుమాడు పంచాయతీ గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో అస్సలు క్రీడా ప్రాంగణాలే నిర్మించలేదు.

మామునూరు, వెంకటాపురం, పెద్దగోపవరం గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో స్థలాలు లేకపోవడంతో పాఠశాలల క్రీడా మైదానాల్లో తూతూ మంత్రంగా ఏర్పాటు చేశారు. రేమిడిచర్ల, రామాపురం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో దూరంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంగణాలన్నీ గడ్డి, ముళ్ళకంప, పిచ్చిచెట్లతో దర్శనమిస్తున్నాయి.

పాటించాల్సిన నిబంధనలు..

నిబంధనల ప్రకారం సుమారు ఎకరం భూమిలో కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ కోర్టులు, టూ పారాలాల్ ఎక్సర్‌సైజ్ బార్స్, సింగిల్ ఎక్సర్‌సైజ్ బార్, లాంగ్ జంప్ పిట్, మొక్కలు నాటడం లాంటివి క్రీడా ప్రాంగణాల్లో విధిగా ఉండాలి. గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తి చూపుతున్నప్పటికీ వసతులు లేమితో క్రీడా ప్రాంగణాల దిక్కుకు కూడా వెళ్లడం లేదు.

కొణిజర్ల మండలంలో..

కొణిజర్ల: మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఒక్కో పంచాయతీలో ఒక్కో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం ప్రతీ పంచాయతీకీ రూ.75 వేలు కేటాయించింది. దీంతో తనికెళ్లలో గ్రామానికి దాదాపు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ ప్రైవేట్ వెంచర్‌స్థలంలో ఏర్పాటు చేశారు. ఇక అమ్మపాలెం, లింగగూడెం పంచాయతీలకు సంబంధించిన క్రీడా ప్రాంగణాలు ఓ గేటెట్ కమ్యూనిటీ వెంచర్ వారు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన గ్రీన్ ఫీల్డ్ స్థలంలో ఏర్పాటు చేశారు. గేటెడ్ కమ్యూనిటీ కావడంతో వారు కొత్తవారిని ఎవరినీ లోపలికి అనుమతించరు. దీంతో అక్కడికి క్రీడాకారులు వెళ్లలేక అవి నిరుపయోగంగా మారాయి.

మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణమేది ?

మండల కేంద్రం కొణిజర్లలో ప్రభుత్వ స్థలం లేక అప్పటి సర్పంచ్ తనకున్న పలుకుబడితో ఓ రైతుకు చెందిన అరఎకరం పొలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశాడు. అంతే కొద్దిరోజులకే స్టాండ్‌లు, బోర్డులు పీకి వేసి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. దాదాపు మండలంలోని అన్ని పంచాయతీలలో ఇదే పరిస్థితి నెలకొంది. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం అయినా క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.



పెద్దగోపతి క్రీడా ప్రాంగణం దుస్థితి

అధికారులకు నివేదిస్తాం..



క్రీడా ప్రాంగణాల విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. గతంలో ప్రభుత్వం తప్పనిసరి అని ఒత్తిడి చేయడంతో సర్పంచ్‌లు ఏదో ఒక స్థలం ఏర్పాటు చేశారు. అవి గ్రామాలకు దూరంగా ఉండడంతో పాటు దగ్గరగా ఉన్న గ్రామాల్లో సైతం నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. వాటిని ఉపయోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం.

– పి.ప్రభాకర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి, కొణిజర్ల

క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించాలి..



మండలకేంద్రంలోని తహసీల్ వెనుక ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో వసతులు లేవు. ఆడుకునేందుకు మైదానం కూడా సక్రమంగా లేదు. గోతులమయంగా ఉంది. క్రీడలకు అవసరమైన సామగ్రి లేదు. ముళ్ల కంప, గడ్డి, పిచ్చిమొక్కలతో ఉన్నాయి. ప్రభుత్వం వసతులు కల్పిస్తే ఆటలు ఆడుకోవడానికి బాగుంటుంది.

– జి.ఆదిత్య, క్రీడాకారుడు, ఎర్రుపాలెం

నైపుణ్యత పెంచాలి..



మండలంలోని జమలాపురం, రేమిడిచర్ల జెడ్పీ పాఠశాలల్లో పీఈటీ పోస్టులే లేవు. బనిగండ్లపాడు, రాజుపాలెం హైస్కూల్స్‌లో పోస్టుల భర్తీకి నోచుకోలేదు. ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణల్లో వసతుల కల్పనతో పాటు పీఈటీల నియామకం కూడా చేపడితే మంచి ఫలితాలుంటాయి.

– మారాబత్తుల జమలయ్య, ఫిజికల్ డైరెక్టర్, మామునూరు జెడ్పీ పాఠశాల

విద్యుత్ శాఖ.. పొలంబాట



కల్లూరు: అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

తల్లాడ/కల్లూరు: తల్లాడమండలంలోని కుర్నవల్లి గ్రామంలో, కల్లూరులోని జీడీబీవల్లి గ్రామంలో సోమవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పంటపొలాల వద్దకు రైతులతో పాటు విద్యుత్ శాఖాధికారులు వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. సత్తుపల్లి డివిజనల్ ఇంజనీర్ ఎల్.రాములు నాయక్, కల్లూరు, తల్లాడ ఏడీఈలు ఎం.యాదగిరి, ఎస్.కె.ఖాదర్‌బాబా, ఏఈలు ఏఈ గణేష్, పి.సుందర్‌కుమార్ సమక్షంలో పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా వంగిన స్తంభాలను సరి చేయడం, విరిగిన లేదా ప్రమాదకరంగా ఉన్న స్తంబాలను మార్చడం, కిందకు వేలాడుతూ లూజ్‌లైన్‌ను సరిచేయడం, రైతులు తమ మోటార్స్‌కు తగిన కెపాసిటీ కల్గిన కెపాసిటర్లను వాడే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ బి.రామదాసు, లైన్‌మేన్ ఐ.తిరుపతిరావు, రైతులు బాబు, శ్రీనివాసరెడ్డి, వెంకటాచారి, శీలం సత్యనారాయణరెడ్డి, నర్సిరెడ్డి, ఆజ్మీరా రామకృష్ణ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మాదిరాజు సుధాకర్, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్‌లను అభినందిస్తున్న మట్టా దయానంద్

సత్తుపల్లి: జర్నలిస్టుల సంక్షేమానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రూ.20 లక్షలతో సత్తుపల్లి జర్నలిస్టులకు సహాయ నిధి ఏర్పాటు చేస్తానని తాను ఇచ్చిన హామీని త్వరలోనే అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై జర్నలిస్టులు ఇచ్చిన వినతిపత్రాలు అందించారు. అనంతరం ఏసీపీ అనిశెట్టి రాఘు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీజేపీ ఖమ్మంజిల్లా పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. ఖమ్మంతో పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పని చేసే జర్నలిస్టులకు సకాలంలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముందుగా అమరులైన జర్నలిస్టులకు నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత జర్నలిస్టులను సత్కరించారు. ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా మాదిరాజు సుధాకర్, ప్రధాన కార్యదర్శి నర్రా అరుణ్, గౌరవ అధ్యక్షులు రామిశెట్టి లక్ష్మణ్‌రావు, బీమిశెట్టి రాము, చినేని బాలకృష్ణ, ఎండి షైబుద్దీన్, తోట కిరణ్, గౌరవ సలహాదారులు దేవా, విజయభాస్కర్‌రెడ్డి, కోశాధికారి రాము, జగన్, రాజేష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎన్నిక కాగా వారిని ముఖ్యఅతిథులు అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్, ఎంపీపీ హైమావతి శంకర్‌రావు, జెడ్పీటీసీ రామారావు, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్, బాజాపా నాయకులతో పాటుగా సీపీఐ కిరణ్, విశ్రాంత జర్నలిస్టులు, సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

చింతకాని: పట్టాదారు పాసుపుస్తకం ఉండి అర్హత కల్గిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు కొప్పుల గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బీమాకోసం ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని రైతులు ఆగస్టు 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల వయసు గల రైతులు అర్హులని తెలిపారు. రైతు బీమా దరఖాస్తులను రైతువేదికల్లో వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేయాలన్నారు. రైతు బీమా పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ షాపులకు టెండర్లు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని సత్తుపల్లి, అశ్వారావుపేట, వీఎం బంజరు బస్టాండ్‌లలో ఖాళీగా ఉన్న షాపులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు సత్తుపల్లి డీఎం యు.రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సత్తుపల్లి బస్టాండ్‌లో 8 షాపులు, అశ్వారావుపేట బస్టాండ్‌లో 5 షాపులు, వీఎం బంజరులో మూడు షాపులకు టెండర్లు పిలిచినట్లు తెలిపారు. వీటిలో కొన్ని మాన్యువల్ టెండర్లు, కొన్ని ఈ టెండర్లు, మరికొన్ని ఆక్షన్ టెండర్లు ఉన్నట్లు తెలిపారు. ఆగస్టు 7వ తేదీలోగా ఆసక్తిగల వారు టెండర్లలో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు డిపో సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని తెలిపారు.

పోలీసులకు సన్మానం

కారేపల్లి: సిద్దిపేటలో జరిగిన మారథాన్ రన్‌లో పాల్గొన్న కారేపల్లి పోలీసులు వెంకన్న, సీతారాములు, రమేష్‌లను సోమవారం కారేపల్లి ఎస్ఐ ఎన్.రాజారాం, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ హరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు భీముడు, కిషోర్, గోపాల్, మజీద్ పాషా, వినోద్, నాగులు, తాహీద్, శ్రీకాంత్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులు, సిబ్బందికి..

కొణిజర్ల: కొణిజర్ల తహసీల్‌లో గత కొన్నేళ్లుగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న అధికారులను సోమవారం తహసీల్ సిబ్బంది ఘనంగా సత్కారించారు. తహసీల్దార్ ఆర్.రాంబాబు మధిర బదిలీ కాగా, డిప్యూటీ తహసీల్దార్ రాగం యర్రయ్య, ఏఎస్ఓ కమలకుమారి, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, ఆఫీస్ సబార్డినేట్ రాధమ్మకు బదిలీపై జిల్లాలోని వివిధ మండలాలకు వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏలు వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

మతిస్థిమితం లేని వ్యక్తిని అనాథాశ్రమానికి తరలింపు



అనాథాశ్రమానికి తరలిస్తున్న వేణుగోపాల్ రెడ్డి

మధిర: గత కొద్దిరోజులుగా మధిర రైల్వే స్టేషన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని మధిర రైల్వే హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రెడ్డి గమనించారు. అతనికి సపర్యలు చేసి స్థానిక అనాథాశ్రమం నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి దంపతులకు సమాచారం తెలుపగా.. వారు అతనిని అనాథాశ్రమానికి తరలించారు. దీంతో వేణుగోపాల్ రెడ్డిని పలువురు అభినందించారు.

దివ్యాంగులకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో సోమవారం దివ్యాంగులకు అన్నదానం చేశారు. మధిర ఫైర్ స్టేషన్ ఉద్యోగి కొలుసు చెన్నారావు, శ్రీదేవి దంపతుల కుమారుడు చర్చిత్ పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. సంస్థ నిర్వాహకురాలు నల్లపూస అన్నదాత చర్చిత్‌ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జాహ్నవి పాల్గొన్నారు.

కారేపల్లిలో రక్తదాన శిబిరం

కారేపల్లి: కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో.. ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్, ఐఆర్ఎస్ జీవన్‌లాల్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు సోమవారం రక్తదానం చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరన్న, ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేష్, నిర్మలా, రాంకిషోర్, హరు, రాంకీ, మూడ్ మోహన్ చౌహాన్, చాందినీ, హనుమా, చందర్, కరణ్‌సింగ్, కోటేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారులకు పారిశుద్ధ్యం పట్టడం లేదు..



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: వైరా మున్సిపాలిటిలో పారిశుద్ధ్యం పడకేసిందని, అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు విమర్శించారు. సోమవారం వైరా సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వీధుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటం, ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారం వేయడం వల్ల దోమలు పెరిగి పట్టణ వాసులు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు సమత, రామారావు, కృష్ణవేణి, శ్రీనివాసరావు, ప్రసాద్, నరసింహాచారి, మధు, మల్లికాంబ, కళావతి, రజిని తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని నూతనకల్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన తూము రంగమ్మ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రంగమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరమోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌లాల్, కోటేశ్వరరావు, లక్ష్మణ్‌రావు, నాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

పెనుబల్లి: పెనుబల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు చీపి కౌశల్య సోమవారం మృతి చెందగా.. గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆమె మృత దేహాన్ని పలువురు సందర్శించి తమ సంతాపం వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు..

మధిరరూరల్: మధిర మండల పరిధిలోని మాటూరు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు మందడపు వీరమ్మ(97) వృద్ధాప్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. పాల్వంచలో నివసిస్తున్న తన తనయుడు వద్ద వీరమ్మ మృతిచెందగా, మృతదేహాన్ని స్వగ్రామం మాటూరుకు తీసుకువచ్చారు. ఆమెకు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

రిటైర్డ్ టీచర్‌కు నివాళి



నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పగడాల పాపయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా .. సోమవారం రెబ్బవరం గ్రామంలో ఆయన చిత్రపటానికి జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, రాష్ట్ర మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గొర్రెల యూనిట్ల డీడీ నగదు ఇప్పించేందుకు కృషి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి నియోజకవర్గంలోని గొల్ల, కురుమ, యాదవులు గత ప్రభుత్వంలో గొర్రెల యూనిట్ల కోసం డీడీలు తీశారు. అయినప్పటికీ గొర్రెలు రాకపోవటంతో చాలా కాలంగా ఆ నగదు కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్యను లబ్ధిదారులు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి తెలుపగా.. ఆమె సీఎం రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు, కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు, తల్లాడ మండలాల పరిధిలోని 2,600 మంది లబ్ధిదారులకు గాను గత వారంరోజులుగా సుమారు 800 మందికి డీడీల నగదును ఎమ్మెల్యే రాగమయి చొరవతో తిరిగి అధికారులు చెల్లించారు. దీంతో లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సోలార్ లైట్లు ఏర్పాటు

పెనుబల్లి: మండలంలోని చౌడవరం అటవీప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీలకు విద్యుత్ సౌకర్యం లేక ఎంతోకాలంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె సింగరేణి యాజమాన్యంతో చర్చించి ఆదివాసీల నివాస ప్రాంతంలో 9 సోలార్ లైట్లు అమర్చారు.

ప్రయాణం సులభతరం..

- గ్రీన్ ఫీల్డ్ హైవే లింగాల వద్ద ఎగ్జిట్ పాయింట్..
- ఆనందంలో పరిసర గ్రామాల ప్రజలు



లింగాల వద్ద నిర్మిస్తున్న నేషనల్ హైవే ఎగ్జిట్

కల్లూరురూరల్: నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే లింగాల వద్ద ఎగ్జిట్ పాయింట్ వల్ల ఈ ప్రాంత ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలగనున్నది. కల్లూరు నుంచి 5 కిలోమీటర్ల దూరంలో గల లింగాల గ్రామ పంచాయతీ శివార్లలో నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఏర్పాటు చేస్తున్న ఎగ్జిట్(దిగుటకు) ఎంట్రి(ఎక్కుటకు) పాయింట్ల వల్ల కల్లూరు నుంచి మధిర వరకు గల 46 కిలోమీటర్ల పరిధిలోని కల్లూరు, చెన్నూరు, పెద్దకోరుకొండి, చిన్నకోరుకొండి, తెలగవరం, మర్లపాడు, వెన్నవల్లి, తాళ్లూరు, వెంకటాపురంలతో పాటుగా.. తల్లాడ మండలంలోని మిట్టపల్లి, కుర్నవల్లి, బస్వాపురం, ముద్దనూరు, అంజనాపురం. మరియు ఆంధ్ర రాష్ట్రంలోని నెమలి, ఊటుకూరు, ఉమ్మడి దేవరపల్లి, మునుకుల్లా, ఎర్రమాడు, పెద్దవరం, రాజుగూడెం తదితర గ్రామాలకు చెందిన సుమారు 3.80 లక్షల మందికి ఎగ్జిట్ పాయింట్ వల్ల నేషనల్ హైవే అందుబాటులోకి వస్తుంది.

ఫలించిన ప్రజల కోరిక..

గతంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే లింగాల వద్ద ఎగ్జిట్ మంజూరు చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరడంతో పాటు.. పలుమార్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరికి వినతి పత్రాలు అందించారు. ఎట్టకేలకు లింగాల కేంద్రంనుంచి ఎగ్జిట్‌కు అనుమతించడంతో ఈ ప్రాంత ప్రజలకు నేషనల్ హైవే రోడ్డు అందుబాటులోకి రావటమే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రాజధానుల మధ్య రవాణాకు అనుకూలంగా మారింది.

విస్తృత సేవా కార్యక్రమాలు

మధిర: మధిర పట్టణంలోని కుందా సావిత్రి స్మారక ఉచిత హోమియో శాశ్వత వైద్య శిబిరం వ్యవస్థాపకుడు, ప్రముఖ దాత కుందా కోటేశ్వరరావు సోమవారం విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదర్శ ఫౌండేషన్ వృద్ధాశ్రమాన్ని, మరనాత ఆర్‌కె ఫౌండేషన్, మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనం, మహాత్మా గాంధీ ఉచిత దుస్తుల పంపిణీ కేంద్రం సందర్శించి దుస్తులు పంపిణీ చేశారు. షేర్ సంస్థ నిర్వాహకులు గోపాల్‌రెడ్డి నిర్వహిస్తున్న డ్రగ్ డి అడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు. ఆయన విజ్ఞప్తి మేరకు త్వరలోనే కేంద్రానికి అవసరమయ్యే సిమెంట్ బల్లలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, ఇరుకుళ్ళ లక్ష్మీనరసింహారావు, మల్లిఖార్జునరావు, బాబ్లా, లంకా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నారాయణపురం లూర్దుమాతా హాస్టల్ విద్యార్థులకు నిత్యావసర సరుకులు, పెన్నులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి హాస్టల్ విద్యార్థులకు, సరుకులు, పెన్నులు స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ కర్నాటి లక్ష్మారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి వెంకట్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ..

కారేపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కారేపల్లి అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన ఆదెర్ల నాగేశ్వరరావు కుటుంబానికి బీఆర్ఎస్ మైనార్టీసెల్ జిల్లా నాయకులు షేక్ గౌసుద్దీన్ 50కేజీల బియ్యాన్ని సోమవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎండీ ఖలీలుల్లాఖాన్, ఆదెర్ల హరి, ఉపేందర్, సాయి, వినీత్, దామర్ల నాగరాజు, అబ్దుల్ వాహెబ్, బాల తదితరులు పాల్గొన్నారు.